# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







# భస్మాసుర 'హస్తం'



- వ్యవసాయాన్ని ఆగం జేసేందుకు కాంగ్రెస్ కుట్ర
- రైతులు బాగుపడడాన్ని ఓర్చుకోలేక పోతున్న హస్తం పార్టీ
- అందుకే రేవంత్ 'మూడు గంటల కరెంట్' పాట
- 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలని కల్లబొల్లి మాటలు
- ధరణి ఎత్తేస్తే మళ్లీ భూ పంచాయితీలు మొదలు
- కాంగ్రెస్‌పై రైతాంగం కన్నెర్ర.. ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిక
- రైతు నేస్తం కేసీఆర్‌కే మా మద్దతు అని ప్రకటన

**వ్యవసాయానికి** మూడు గంటల కరెంటు, బోర్లల్లో 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్న కాంగ్రెసోళ్లపై అన్నదాతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన ఘటనలు యాది మరువలేదని, పాముకాట్లు, కరెంటు షాక్‌లతో చనిపోయిన రైతుల ముఖాలు ఇంకా గుర్తున్నాయని చెబుతున్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో, సీఎం కేసీఆర్ నేతృత్వంలో వ్యవసాయానికి నాణ్యమైన 24గంటల కరెంటు ఉచితంగా ఇవ్వడంతోనే మా ముఖాల్లో వెలుగులు వచ్చాయని, సంతోషంగా జీవిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. మీరొద్దు.. మీ కరెంటు వద్దురా బాబోయ్ అంటుంటే.. మళ్లీ వచ్చి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని బట్టేబాజ్ మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉన్న మోటర్లు పీకేసి.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు ఇస్తున్న ఉచిత సలహాపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అధికారంలో లేనప్పుడే రైతులపై అక్కసు వెళ్లగక్కుతున్న ఈ కాంగ్రెసోళ్లకు పగ్గాలు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. మమ్మల్ని కాపాడింది.. మా మేలు కోరిందీ కేసీఆరే.. ఆయనకే మా మద్దతు ఉంటుందని స్పష్టంచేస్తున్నారు.






## పొలాలకు 10హెచ్‌పీ మోటర్లు పెడ్తరా..

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంట్‌కు కష్టాలు వస్తాయ్. కరెంట్ మీద కాంగ్రెసోళ్లు ఒక్కో నాయకుడు ఒక్కో రకంగా మాట్లాడుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఐదు గంటలు కరెంట్ ఇస్తున్నాం అంటారు. ఇక్కడి వచ్చి వ్యవసాయానికి మూడు గంటలు సరిపోతుందని.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నారు. అధికారంలోకి వస్తే అసలు కరెంటు ఎన్ని గంటలు ఇస్తారో వారికే తెలియదు. వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై వాళ్లకు అస్సలు అవగాహన లేదు. వాళ్ల మాటలు నమ్మి మోసపోతే తర్వాత తిప్పలు పడాల్సింది మనమే.

**- మాధవ్‌రావు, రైతు, కొల్లూర్,పొతంగల్ మండలం**

## కాంగ్రెస్ వస్తే ఎదురుచూపులే మళ్లీ



కోటగిరి, నవంబర్ 24 : పొరపాటున కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ కోసం రేయింబవళ్లు ఎదురు చూడాల్సిందే. గతంలో వారి పాలనలో రైతులు అరిగోసపడ్డారు. తెలంగాణ వచ్చాక పంటలకు కరెంట్ సరిపోను ఉంటున్నది. సీఎం కేసీఆర్ సార్ దూరదృష్టితో కరెంట్ కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు చల్లగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వచ్చి అది చేస్తాం. ఇది చేస్తామని మాయమాటలు చెబుతున్నారు. వాటిని నమ్మితే మళ్లీ మోసపోతాం. మూడు గంటల కరెంట్ ఇస్తే ఏ మూలన నీళ్లు పారుతాయి...? కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత రోజులే దాపురిస్తాయి. కేసీఆర్ సర్కారే మళ్లీ రావాలి.

**-మల్లెపూల దత్తాగౌడ్, రైతు, దోమలెడ్గి, పొతంగల్ మండలం**

## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కోతలే..

తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నది. దీంతో రైతులకు పంటలు బాగా పడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. మళ్లీ కరెంటు కష్టాలు వస్తాయి. పొలాల ఎండిపోతాయి. రైతులకు మళ్లీ ఆత్మహత్యలే శరణ్యం అవుతాయి. అందుకే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలి. రైతులమంతా కేసీఆర్ వెంటే ఉంటాం.

**- రమేశ్ యాదవ్, రైతు ,దోమలెడ్గి, పొతంగల్ మండలం**





## మూడు గంటల కరెంటుతో ఆత్మహత్యలే..

మూడు గంటల కరెంటుతో రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయి. 24 గంటలు విద్యుత్‌తో రెండు పంటలు పండించుకుంటున్న రైతు ఆనందంగా ఉన్నాడు. 10 హెచ్‌పీ మోటర్లు, మూడు గంటలు కరెంట్ అంటున్న కాంగ్రెస్ మాటలతో ఒరిగేది ఏమీలేదు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి 24 గంటలు కరెంట్ ఇచ్చే ప్రభుత్వాన్ని వదులుకుంటే నోళ్లు తెరిచిన బీడు భూములే దర్శనమిస్తాయి. ఉచిత విద్యుత్‌తో 24గంటలకు ఇచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి. పోచారం సారుకే మా ఓటు వేస్తాం. మళ్లీ సీఎం కేసీఆర్ సారె రావాలి..

**- వడ్ల పండరినాథ్. రైతు,కొల్లూర్**

## అరకొర విద్యుత్‌తో రైతుల నానా ఇబ్బందులు..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అరకొర విద్యుత్‌తో రైతులు నానా తంటాలు పడ్డాం. విద్యుత్ సరిగా అందకపోవడంతో మోటర్లన్నీ ఒక్కసారిగా చాలు చేయడంతో కొన్ని మోటర్లు కాలిపోయి రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు పండేవి. లేకపోతే వదిలేద్దామనే పరిస్థితి ఉండేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తుండడంతో ఏ ఒక్క రైతు పొలం ఇంత వరకు ఎండిపోయిన దాఖలాలు లేవు. తెలంగాణ ప్రభుత్వంలోనే రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌ను కాదని మళ్లీ పాత కష్టాలు కొని తెచ్చుకోలేము.

**- శివకుమార్, రైతు, హెగ్డోలి, పొతంగల్ మండలం**





## కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే మునిగినట్లే..

కరెంటు విషయంలో కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నిండా మునిగిపోతాం. కేసీఆర్ వచ్చిన తర్వాత 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చుతోటి మంచిగా పంటలు పండించుకుంటున్నాం. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు ఇష్టమొచ్చినట్లు అస్తుండె.. పోతుండె. వ్యవసాయం అంటేనే విరక్తి కలిగేది. దీంతో ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకునేటోళ్లు. కానీ కేసీఆర్ వచ్చిన తర్వాత వ్యవసాయం పండుగలా మారింది. నీరు పుష్కలంగా ఉండడంతో దిగుబడి కూడా పెరిగింది. కాంగ్రెస్ వాళ్లు ఇస్తామంటున్న మూడు గంటల కరెంటుతో రైతులకు మళ్లీ పాత రోజులే వచ్చి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురిస్తది. కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితిల్లో నమ్మం.

**-డి. రాంబాబు, రైతు, హెగ్డోలి, పొతంగల్ మండలం**

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..

ఉచితం కరెంటుతో పంటలను మంచిగా పండించుకుంటున్నాం. కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్ ఇస్తే ఎకరం పొలం కూడా నీరు పారదు. 10 హెచ్‌పీ మోటర్లు వేస్తే బోరు నుంచి నీళ్లు సరిగ్గా రావు. నీటి ఊటలు తగ్గి.. మోటర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే. రైతులను రాజు చేస్తున్నది సీఎం కేసీఆర్ సార్. మేమంతా బీఆర్‌ఎస్ పార్టీకే ఓట్లేస్తాం. కేసీఆర్ సార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

**-బి. సంగ్రాం పటేల్, రైతు, తిర్మలాపూర్‌పూర్, పొతంగల్ మండలం**





## 24 గంటల కరెంటే ఊపిరిపోస్తుంది..

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి అందిస్తున్న 24 గంటల కరెంట్ రైతులకు ఊపిరిపోస్తుంది. ఆనాడు రాత్రిపూట నీళ్లు పెట్టడానికి చేనుకు వెళ్తే పురుగుబూసి కుట్టకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే వాళ్లం. ఇప్పుడు అలాంటి భయం లేదు.మళ్లీ ఆ రోజులు వస్తే రైతు కుటుంబాల్లో అంధకారమే. వచ్చీరాని కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా రాక ఆర్థికంగా నష్టపోయేది. సరిగ్గా దిగుబడులు లేక అప్పులే మిగిలేవి. రైతుబంధు పెట్టుబడి సాయం, ఉచిత కరెంట్‌తో మా కష్టాలు తొలిగిపోయాయి. కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు మూడు గంటల కరెంట్ పది సాళ్లను తడపడానికి కూడా సరిపోదు. మాకు మాటలు చెప్పే నాయకులు వద్దు..చేతలు చేసి చూపించే కేసీఆర్ లాంటి నాయకుడే కావాలి.

**- దశమంతురావు, రైతు, దోమలెడ్గిక్యాంపు**

## 24 గంటల కరెంటే మంచిగున్నది..

వర్ని, నవంబరు 24 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంక ఎవుసానికి కడుపునిండా కరెంటు ఇస్తుండ్రు. మేము రెండు పంటలు రంది లేకుండా పండించుకుంటున్నాం. ఇప్పుడు కరెంటు విషయంలో ఏ సమస్యా లేదు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెసోళ్లు అచ్చి మూడు గంటలు కరెంటు చాలు, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నారు. కాంగ్రెస్ హయాంలో మేము పడ్డ కష్టాలు ఇప్పుడిప్పుడే మరిచిపోతున్నాం. కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ అప్పటి కష్టాలు తప్పవు. అప్పుడు ఎవుసం బంద్ పెట్టుకునుడే అయితది.

**-వాంక్‌దోత్ రూప్ సింగ్ , మల్లారం**

